# రాజా

శ్రీమతి పాకల రత్నమాలగారు

రాజా పుట్టిననెలరోజులకే తల్లి ఇహలోకంవిడిచింది. అప్పటినుండీ రాజాని అతిగారాబముగా పెంచుతోంది నాయనమ్మ తల్లిలేని లోటులేకుండా. రాజాఅంటే చిన్నాయనకి చాలాప్రేమ. తనకికొడుకు లేకపోవటంవల్ల మరింత ప్రేమించేవారు.

అందరిచేతుల్లో అల్లారుముద్దుగా పెరుగుతున్నాడు రాజా. ఇల్లాగే మూడుసంవత్సరాలు గడిచేయి. నాలుగోసంవత్సరం పెట్టింది ఓనాడు చిన్నాయన గదిలోకివెళ్ళి మంచంమీదయెక్కి ఆడుకుంటున్నాడు రాజా గంతులు వేస్తూ. మంచంమీద దుప్పటిజారి క్రిందపడిపోయింది ఇంతట్లో రాజాపిన్నమ్మ గదిలోకివచ్చి చూచింది ఏమిటిలా గంతులువేయటం, దుప్పటిపడిపోయింది, పరుపుమాసిపోదూ, నువ్వు అల్లరిబాజావవుతున్నావు, ఇకనుండి నామంచంఎక్కు నీపనిచెబుతానన్నది కోపస్వరముతో. రాజా చిన్నబోయాడు. ఒక్కనిముషంలో మంచందిగి నాయనమ్మదగ్గిరకి పారిపోయేడు. ఆరోజునుంచి పిన్నమ్మ గదిలోకి వెళ్ళటం మానివేసాడు.

ఆనాడు ఆదివారం. చిన్నాయన తీరికగాగదిలో మంచంమీద కూర్చున్నారు. రాజా గబగబావచ్చి మంచంయెక్కి చిన్నాయనవీపుమీదపడి ఆడుకొంటున్నాడు. పిన్నమ్మ చూచింది. నెలదినములుగా తనగదిలోనికిరాని రాజా నేడు హఠాత్తుగారావటం ఆశ్చర్యమనిపించింది. రాజా ఇవ్వాళ ఎందుకువచ్చావ్ ఇక్కడికి అన్నాది నవ్వుతూ. పిన్నమ్మమాట పూర్తిగాకముందే "మాచిన్నాయన ఉన్నారుగా"అన్నాడు రాజా ధాటీగా. ఏమిటీకధ అన్నారు చిన్నాయన జరిగిన సంగతంతాచెప్పింది పిన్నమ్మ. చిన్నాయన రాజాకిగల పౌరుషానికి చాలా సంతోషించేరు. వెంటనే కొడుకునెత్తుకుని తల్లిదగ్గిరకి తీసుకువెళ్ళి జరిగినదంతా చెప్పేరు నవ్వుతూ. "నాయనా! నీవు పేరుకుతగినవాడవు పిన్నమ్మకు బాగా బుద్ధిచెప్పావు" అన్నారు. కొడుకుచేసేముద్దుచేష్టలు పలికేముద్దుపల్కులు వినటానికి తల్లిలేకపోయినదని కంటతడిబెట్టింది నాయనమ్మ. తాను రాజాని కోపపడినందుకు సిగ్గుపడింది పిన్నమ్మ. తరువాత అందరూ రాజాకు ముద్దులు బహుమతీచేసేరు.